www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 11 ఫిబ్రవరి 2024

5

పశ్చిమ గోదావరి

ఒపిఎస్ సాధనకు పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - పోడూరు



పోస్ట్ కార్డులు పంపుతున్న నేతలు

ఉద్యోగులకు పాత పింఛన్ సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ తలపెట్టిన ఓట్ ఫర్ ఒపిఎస్ కార్యక్రమంలో భాగంగా గుమ్మలూరు పోస్టాఫీస్ వద్ద 300 పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఎవరైతే తమ పాత పింఛన్ విధానాన్ని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తారో వారికే తమ ఓట్లు అనే సందేశాన్ని పంపించామని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ తెలిపారు. తమ డిమాండ్ నెరవేరేవరకు దశల వారి పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్ష, కార్యదర్శులు డి.క్షేమమూర్తి, కె.నాగరాజు, ఎంవి.రావు, ఎం.శ్రీనివాసరావు, భ్రమరాంబ, సంతాగ్రేస్, మాధవి పాల్గొన్నారు.

అయోమయం... గందరగోళం..!

ఉండి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల పరిస్థితి

ఎంఎల్‌ఎ అభ్యర్థి ఎవరనే దానిపై తీవ్ర చర్చ

మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రచారం

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి ఉండి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. ఒకపక్క ప్రస్తుత ఎంఎల్ మంతెన రామరాజు తానే మరోసారి అభ్యర్థినని గతంలోనే ప్రకటించారు. మరోపక్క వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఉండి అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నట్లు మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు ప్రకటించారు. శివరామరాజుకు టిక్కెట్టు దక్కడం అనుకున్నంత తేలికేం కాదని ఆ పార్టీ కార్యకర్తలు అనుకుంటున్నారు. ఈ క్రమంలో శివరామరాజు కొంతకాలం నుంచి ఊపు పెంచారు. ప్రధానంగా రామరాజుపై ఉన్న కొద్దిపాటి వ్యతిరేకతను తీవ్రతరం చేయడానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలోని వ్యతిరేక గ్రూపులను దగ్గర చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారని పలువురు చెబుతున్నారు. తానే టిడిపి అభ్యర్థినని శివరామరాజు పూర్తిస్థాయిలో ప్రచారం సాగిస్తున్నట్లు అభిమానులు చెబుతున్నారు. రాంబాబుకు ఆర్థిక లావాదేవీల మైనస్ ఉన్నప్పటికీ ప్రతిపక్ష స్థానంలో ఉండి కూడా ఐదేళ్ల నుంచి పార్టీని, కార్యకర్తలను మోసిన వ్యక్తిగా అందరికీ అభిమానం ఉంది. ఆర్థిక సామాజిక భారాలు ప్రతిపక్షంలో ఉండి మోయటం అంత తేలికేం కాదంటున్నారు రామరాజు అభిమానులు. 2019 ఎన్నికల అయిపోయిన తర్వాత సుమారు నాలుగున్నరేళ్ల వరకూ శివరామరాజు చిరునామా కూడా నియోజకవర్గ ప్రజలకు తెలియదని రామరాజు అభిమానులు అంటున్నారు. ఐదేళ్లుగా పార్టీకి సేవ చేస్తున్నవారిని కాదని పార్లమెంటు స్థానానికి పోటీ చేసి ఓడిపోయి నాడు వెళ్లిపోయిన అభ్యర్థి ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి తిరిగొచ్చి తానే అభ్యర్థి అంటే ఎలా అంగీకరిస్తామంటూ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

శివరామరాజు ఓడిపోయిన నాడు ఇక్కడ అతనికి గ్రూపు ఉండేది. ఎన్నికల తెల్లారి నుంచి ఆయన కనిపించకపోవడంతో ఆ గ్రూపు కాస్త ప్రస్తుత నాయకుల గ్రూపులుగా మారిపోయాయి. పాత గ్రూపు ఉదంటూ రంగంలోకి దిగిన శివరామరాజుకు ఆశించిన మేర ప్రజల్లో ఆదరణ కనబడటం లేదని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం పార్టీకి చెందిన నాలుగు మండలాల ప్రధాన నాయకులు, అధ్యక్షులు ఉండి మండలంలో సమావేశమయ్యారు. వీరందరూ రాంబాబుకు మద్దతుగా సమావేశమైనట్లు తెలుస్తోంది. తానే అభ్యర్థినని, లేదా స్వతంత్రంగా పోటీ చేస్తానని శివరామరాజు ప్రచారం చేసుకుంటున్నారని, ప్రస్తుత ఎంఎల్‌ఎ రామరాజు తన పని తాను చేసుకుపోతున్నారని రాంబాబు అభిమానులు చెబుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వీరిద్దరి మద్దతుదారులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. తమకు అభ్యర్థి ఎవరైనా ఒకటే పార్టీ ప్రధానం అనుకునే వారి పరిస్థితి మాత్రం ప్రశాంతంగా ఉంది. అయితే వారిలో కూడా అభ్యర్థి ఎవరనే ఆత్రుత స్పష్టంగా కనిపిస్తోంది.

పార్లమెంట్ అభ్యర్థి ఎవరనేది చర్చ

ఇదిలా ఉండగా పార్లమెంటు అభ్యర్థి ఎవరన్నది కూడా ఇక్కడ చర్చ జోరుగా సాగుతోంది. ఏ పార్టీ పోటీ చేసినా కూటమి అభ్యర్థి మాత్రం రఘురామరాజు అన్నది ఇక్కడ ప్రతిఒక్కరు అంగీకరిస్తున్న మాట. అయితే రఘురామరాజు మొదట్లో జనసేన నుంచి పోటీ చేస్తారని కొన్ని లీకులు వచ్చాయి. ఇటీవల ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అనధికారికంగా ప్రచారం సాగింది. అయితే గత రెండు రోజుల నుంచి మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రఘురామరాజు బిజెపి అభ్యర్థిగా ప్రచారం మొదలైంది. ప్రతిపక్ష పార్టీల్లో ఏ పార్టీ నుండైనా అభ్యర్థి మాత్రం రఘురామరాజే అనే ప్రచారం జోరుగా సాగుతోంది.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ పి.ప్రశాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్‌మీనా ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ ప్రశాంతితోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి అన్ని నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆచంట మండలం లంక గ్రామాల్లో రెండు పోలింగు స్టేషన్లు ఉన్నాయని, పోలింగ్ మెటీరియల్ తీసుకెళ్లేందుకు, మళ్లీ తీసుకొచ్చేందుకు ప్రొటోకాల్ ప్రకారం బోట్లు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 1,461 పోలింగు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలన్నీ సిద్ధం చేశామని, ఒక టాయిలెట్ ఉన్నచోట, తాత్కాలికంగా రెండో టాయిలెట్ ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. సాధారణ ఎన్నికలకు బందోబస్తుకు పోలీసు సిబ్బంది కొరత ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర బలగాలను పంపించాలని లేఖ పంపామన్నారు. అధికారులకు, సిబ్బందికి అన్ని రకాల శిక్షణ తరగతులు ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది, పోలీసు బందోబస్తు, వాహనాలు ఎన్ని అవసరమో డేటాను సిద్ధం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివనారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుతఅంబరీష్, కె.చెన్నయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, ఇన్‌ఛార్జి డిపిఒ ఎం.నాగలత, లీడ్ బ్యాంకు మేనేజరు నాగేంద్ర ప్రసాద్, ఎన్నికల తహశీల్దార్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్లు ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

రైతు, కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ హరే రామ్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నేపథ్యంలో మండల, పట్టణ కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రైతు, కార్మికసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్‌కెఎం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి అధ్యక్షత వహించారు. జిల్లా కన్వీనర్ ఆకుల హరేరాం మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని విమర్శించారు. గతంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చి కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగాన్ని దెబ్బతీయడానికి ప్రమాదకరమైన క్రిమినల్ చట్టాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకించాలన్నారు. ఇటీవల తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్టు బిల్లు లారీ యజమానులకు, ఆటో డ్రైవర్లకు ఉరితాడు వంటిదని హెచ్చరించారు. సమావేశంలో వివిధ కార్మిక, రైతుసంఘాల నాయకులు బి.వాసుదేవరావు, మల్లిపూడి ఆంజనేయులు, చింతకాయల బాబూరావు, చెల్లబోయిన రంగారావు, కళింగ లక్ష్మణరావు, దండు శ్రీనివాసరాజు, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

గట్టు కుంగడం ఆగేందుకు సమయం పడుతుంది

ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారుల బృందం

ఏటిగట్టును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

2022లో వచ్చిన గోదావరి వరదల వల్ల చోటుచేసుకున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన మెటీరియల్‌తో పనులు చేశామని గోదావరి డెల్టా సెక్షన్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. ఏటిగట్టు కోతకు గురికాకుండా చర్యలు చేపట్టాలని అదే సమయంలో సిఎం జగన్ ఆదేశాలిచ్చి రూ.2 కోట్లు చొప్పున నిధులు విడుదల చేశారన్నారు. గోదావరి గట్టు కోతకు గురవుతున్న ప్రాంతాన్ని ప్రభుత్వ సలహాదారు గిరిధర్‌రెడ్డి, సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌యాదవ్, చీఫ్ ఇంజినీర్ క్వాలిటీ కంట్రోలర్ పుల్లారావు, ఎస్‌ఇ జి.శ్రీనివాసరావు, డిఇ సిహెచ్.శ్రీనివాసరావు, ఎఇ కె.సుబ్బారావు పరిశీలించారు. దానికి సంబంధించిన వివరాలను సతీష్‌కుమార్ మీడియాకు వివరించారు. ఏటిగట్టు శాశ్వత అభివృద్ధి పనుల నిమిత్తం రూ.26.32 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆ నిధులతో స్టోన్ పిట్చింగ్ పనులను చేపట్టామన్నారు. దీనిలో గోదావరిలో రాళ్లు వేయడమేనని, లోపల రాళ్లు నిలబడి సపోర్ట్ దొరికే వరకు రాళ్లు వేయాల్సిందేనన్నారు. ఇది కాంక్రీట్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పద్ధతి కాదన్నారు. సిద్ధాంతం సమీపంలో దొంగరావిపాలెం వద్ద స్లిప్ అనేది డెవలప్ అయిందని, అది సెటిల్ కావడానికి 25 సంవత్సరాలు సమయం పట్టిందన్నారు. పొన్నపల్లి ఏటిగట్టు 400 మీటర్ల అభివృద్ధి పనుల్లో 40 మీటర్లు కోతకు గురవుతుందని, ఆ 40 మీటర్ల ప్రాంతంలో ఏవిధంగా పనులు చేయాలనే దానిపై బృందం పరిశీలించి సలహాలు ఇస్తుందన్నారు. దాని మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు.

14 నుంచి ఉభయగోదావరి జిల్లాల్లో పవన్ పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు ప్రముఖులతో సమావేశమవుతారు. దీనిలో భాగంగా 14వ తేదీన భీమవరంలో ఆయన పర్యటించనున్నారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - ఉండి

శాంతిభద్రతల పరిరక్షణ, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. ఆమె శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి అజిత మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ఉండి మండల మ్యాప్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేదని, డ్వాక్రా భవనంలో సుమారు 20 సంవత్సరాల నుంచి ఉంటుందని సిఐ కెవివిఎన్.సత్యనారాయణ ఎస్‌పికి వివరించారు. ఎస్‌పి రవిప్రకాష్ హయాంలో పోలీసు స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పూడిక చేయించారన్నారు. అనంతరం ఎస్‌పి అజిత సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ లక్ష్మణ్‌కు పలు సూచనలు చేశారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజల సంక్షేమమే గ్రంధి కుటుంబ లక్ష్యం

రాష్ట్రస్థాయి చెస్ పోటీలను ప్రారంభించిన ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ కుటుంబం పని చేస్తుందని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్-2024ను ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. స్థానిక జివిఆర్ కళ్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి శ్రీనివాస్ మాట్లాడుతూ కీర్తిశేషులు గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) మున్సిపల్ ఛైర్మన్‌గా భీమవరం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో అందరికీ ఆయన ఆదర్శవంతుడిగా నిలిచారని తెలిపారు. అటువంటి మహోన్నత వ్యక్తి పేరున రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహించి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గ్రంధి వెంకటేశ్వరరావు బాటలోనే ఆయన తనయుడు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ నిరంతరం ప్రజాసేవలో ఉన్నారన్నారు. వైసిపి యువత రాష్ట్ర నాయకులు గ్రంధి రవితేజ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా మీకు ఇష్టమైన రంగాలను ఎంచుకుని ఆ రంగాల్లో ప్రతిభను చాటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, రాష్ట్ర చెస్ కాంపిటేషన్ గౌరవ అధ్యక్షులు తోట భోగయ్య, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బిసి సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, చెరుకువాడ రంగసాయి, మాదాసు కిషోర్, తోట హరిబాబు, గమిని పవన్ పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

గ్రామాలాభివృద్ధికి కృషి : చీఫ్ విప్

ప్రజాశక్తి - నరసాపురం



హెల్త్ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ప్రసాదరాజు

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కె.బేతపూడి గ్రామంలో ఆయన శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రూ:20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ:14, లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని, రూ.13 లక్షలతో నిర్మించిన గ్రామ మహిళా సమైక్య భవనాన్ని ప్రసాదరాజు ప్రారంభించారు. అనంతరం గ్రామ మహిళసమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, రోడ్లతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం రుణ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రతి నెలా సమైక్య సమావేశాలు నిర్వహించుకుని సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మించామని చెప్పారు. వైద్య రంగంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చామన్నారు. గ్రామీణ ప్రజలకు వారి సొంత ఊర్లలోనే ప్రాథమిక వైద్య చికిత్సలను, వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అంగన్వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు, గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోని, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, గ్రామ సర్పంచి బెల్లపుశ్రీ రోజారాణి, దొంగ మురళీకృష్ణ, మైలాబత్తుల శ్రీను, చిన్నమిల్లి చందు, ఎఇ వైవిఆర్.నాగేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది హనుమంత్, పంచాయతీ బోర్డు సభ్యులు గండికోట శ్రీను, ముచ్చర్ల సాంబమూర్తి, కటికల ధనలక్ష్మి, పాతి మంగతాయారు, రాజేష్, శర్వాణి, యూత్ ప్రెసిడెంట్ కొండేటి రవి, గ్రామ సమాఖ్య ప్రెసిడెంట్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. సమస్యలు అనేకం

ఉండి మండల సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచుల ఆగ్రహం

సక్రమంగా విధులు నిర్వహించకుంటే చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - ఉండి

సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీహరినారాయణరాజు

అధికారుల నిర్లక్ష్యంతో ఉండి మండలం సమస్యలకు నిలయంగా మారిందని పలువురు ఎంపిటిసి సభ్యులు, పలు గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో పారిశుధ్య సమస్య విలయతాండవం చేస్తుందని, డ్రెయినేజీలు ప్రక్షాళన చేయకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉప్పులూరు గ్రామంలో కాలువ గట్టు వైపు ఉన్న జగనన్న కాలనీలకు వెళ్లే రహదారిని నిర్మించకుండా గృహ నిర్మాణ శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించడానికి వీలు లేకుండా ఉందని ఎంపిటిసి వాపోయారు. ఇంకో నెల రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తే ఇల్లు నిర్మించడానికి వీలు కాదని, తక్షణమే అధికారులు ఆ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్‌పి.అగ్రహారంలో అధికారులు చేసిన మాయాజాలంలో చిక్కుకున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు కొంతమందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. తక్షణమే లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆ గ్రామం ఎంపిటిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి అధికారులు అధిక సంఖ్యలో గైర్హాజరు కాగా ప్రజాప్రతినిధులు సైతం తక్కువ మందే హాజరయ్యారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు రణస్థుల కనకదుర్గ మహంకాళి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుత్తుల కనకమహాలక్ష్మి కృష్ణ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ, ఉనుదుర్రు సర్పంచి పిన్నంరాజు నాగలక్ష్మి, ఆరేడు సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం, కలిగొట్ల, ఉనుదుర్రు, కోలమూరు, కలిసిపూడి, చిలుకూరి, ఉండి, పెదపుల్లేరు గ్రామాల ఎంపిటిసి సభ్యులు రుద్రరాజు సూర్యనారాయణరాజు, అల్లూరి మాధవి, పేరిచర్ల అరుణ భార్గవి, దంగేటి రామలింగేశ్వరరావు, కరణం త్రిమూర్తులు, గిరిడా రమణ శ్రీనివాస్, కునుకు రమాదేవి శ్రీనివాస్, రాయి రావులమ్మ, ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ.. నిర్బంధం..!

ఓవైపు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వివిధ తరగతుల ప్రజల్లో నిరాశ.. ఆ హామీల అమలు కోసం నినదిస్తే నిర్బంధం. ఇదీ జిల్లావాసులు గడిచిన వారం రోజుల్లో ఎదుర్కొన్న అనుభవం. దెందులూరులో సిఎం 'సిద్ధం' సభ, రాష్ట్ర బడ్జెట్ జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేయగా.. హామీల అమలు కోసం గొంతెత్తిన ఆశా వర్కర్లపై ప్రభుత్వ దమనకాండ, నిర్బంధం అందరినీ నివ్వెరపర్చింది.

ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా అధికార పార్టీ వైసిపి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల స్థాయి 'సిద్ధం' సభ ఏలూరు శివారు దెందులూరులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ ప్రయివేటు స్థలంలో పెద్దఎత్తున నిర్వహించింది. జనసమీకరణ తదితర అంశాలు పక్కనబెడితే తమ పదవీకాలంలో చేసిన పనులన్నీ చెప్పి వాటినే ప్రచారం చేయాలని వైసిపి శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు. కనీసం సభకు కేంద్రమైన నియోజకవర్గానికి సంబంధించిన కొల్లేరు అంశంపై కనీసం నోరుమెదపలేదు. సమీపాన ఉన్న ఏలూరులో బయటపడిన అంతుచిక్కని వ్యాధి గురించి ప్రస్తావనే లేదు. వీటన్నింటితోపాటు ఈ జిల్లా పరిధిలో ఉన్న పోలవరం నిర్వాసితులకు సంబంధించి చేసిందేమిటి.. చేయబోయేదేమిటీ అనే ఊసే కరువైంది. వాళ్లు చేసింది చెప్పుకోవడమే తప్ప పెండింగు అంశాలకు సంబంధించి జనం వైసిపి శ్రేణులను నిలదీస్తే ఏం చెప్పాలనేది సిఎం జగన్ స్పష్టత ఇవ్వకపోవడంపై వైసిపి శ్రేణుల్లోనే కొంత గందరగోళం నెలకొందని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు 'సిద్ధం' అయ్యేది ఇలాగేనా అని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఇక రాష్ట్ర బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. వైసిపి ప్రభుత్వం తన పదవీకాలంలో ప్రవేశ పెట్టిన చివరి బడ్జెట్ మధ్యంతరమే అయినా కనీసం కొన్ని హామీల అమలుకు రాబోయే కాలంలో కేటాయింపులపైనా ప్రస్తావన లేకపోవడం అందరినీ నిరాశపర్చింది. పోలవరం నిర్వాసితులు, కొల్లేరు ప్రజలకు పునరావాసం, ఉపాధి, డెల్టా ఆధునికీకరణ, వాటర్‌గ్రిడ్, ఫిషింగ్ హార్బర్ వంటి అంశాలేవీ చర్చకు రాకపోవడంపై జిల్లావాసులు పెదవివిరుస్తున్నారు.

చింతలపూడిలో 'రా.. కదలిరా' పేరిట చంద్రబాబు సభ ఆర్భాటంగా నిర్వహించగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల దెందులూరు నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. చంద్రబాబు సభ గతానికి భిన్నంగా నిర్దేశిత సమయానికి ప్రారంభం కావడంతో జనం హాజరు బాగానే ఉంది. అయితే చింతలపూడి, పోలవరం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారేగాని సభ జరిగిన ప్రాంతానికి చెందిన చింతలపూడి ఎత్తిపోతల పథకంలో నిర్వాసితులైన రైతులకు పరిహారంపై స్పష్టమైన ప్రకటన

చేయకపోవడం నిర్వాసిత రైతులను నిరాశకు గురి చేసింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనూ పరిహారం గురించి రైతులు ఆందోళన చేసిన విషయం గుర్తుకు తెచ్చుకుని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు 'దొందూ.. దొందే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని రైతులు పెదవివిరుస్తున్నారు. షర్మిల ప్రధానంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా సాగిస్తున్న ప్రసంగాలు, బిజెపి, వైసిపి ప్రభుత్వాలపై ఎక్కుపెడుతున్న విమర్శలు ఆ పార్టీకి ఓట్లు ఏ మేరకు తీసుకొస్తాయో చెప్పలేముగాని చర్చనీయాంశమవుతున్నాయని చెప్పొచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

పోలీసు శాఖ ప్రజా రక్షణకా.. పాలకుల రక్షణకా అనే చర్చ జిల్లాలో పెద్దఎత్తున సాగుతోంది. ఆ శాఖపై రాజకీయ ఒత్తిడి, ప్రభుత్వాల మౌఖిక ఆదేశాల ఒత్తిడి కొత్తేమీ కాదు. అయితే తాము గీసుకున్న లక్ష్మణరేఖ పరిధిలో పాలకులకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వారి ఆదేశాలను పాటించినా ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం నిరంతరం కృషి చేసేవారు. వైసిపి పాలనలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఏదైనా సమస్యపై ఉద్యమించేవారిని రోడ్డెక్కాక అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించడం చేసేవారు. ఈసారి అత్యంత నిరంకుశపూరితంగా ఇళ్ల వద్దే అడ్డుకుంటున్నారు. అదేదో అధికారిక కార్యక్రమానికే అనుకుంటే పొరబడినట్లే. సిద్ధం సభ పూర్తిగా రాజకీయ సభ. ఆ సభలో పాల్గొనేందుకు సిఎం జగన్ వస్తున్నారనే పేరుతో నిరసనలు తెలుపుతారనే భయంతో సిపిఎం, సిఐటియు, రైతుసంఘం, ఇతర పార్టీలు, ప్రజాసంఘాల నేతలను కార్యాలయాల్లో, ఇళ్ల వద్ద నిర్బంధించడం ఏమిటో అర్థంకాక మేధావులు, జనం సైతం ముక్కు మీద వేలేసుకున్నారు. ఇక ఆశాల చలో విజయవాడ నేపథ్యంలో పోలీసుల తీరు మరింత చర్చనీయాంశమైంది. ప్రభుత్వమే మానవత్వ విలువలు కోల్పోయిందనుకుంటుంటే పోలీసులు సైతం కనీస మానవత్వ విలువలు పాటించని పరిస్థితి ఈ సందర్భంగా కన్పించింది. నూజివీడులో సిఐ రైతుసంఘం నేతపై సాగించిన జులుం, దురుసు ప్రవర్తన పోలీసులా, అధికార పార్టీ ప్రయివేటు సైన్యమా అనే అనుమానం తలెత్తేలా చేసింది. అలాగే పలు పోలీసు స్టేషన్లు, ప్రయివేటు కళ్యాణ మండపాల్లో నిర్బంధించిన ఆశాలకు మధ్యాహ్నం సమయంలో కనీసం భోజనం అందించకపోవడం, మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులే ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులే భక్షకులుగా మారితే ఇక మహిళలకు సమాజంలో ఆకతాయిలు, దుండగుల నుంచి ఎదురయ్యే సమస్యలేమిటో రెండు జిల్లాల్లో ఉన్న పోలీసు శాఖలో ఉన్నతాధికారిణులైన మహిళలకు తెలియదా అనే చర్చ సాగుతోంది. పైగా పేర్లు చెప్పకపోతే భోజనం చేయడం ఆపాలంటూ నూజివీడు సిఐ రంకెలు దేనికి తార్కాణమో చెప్పాలి. పోలీసులపై ఒత్తిడి ఉండొచ్చు. అయితే ఈ తరహా ప్రవర్తన ఎన్నడూ మాత్రం జిల్లావాసులు చవిచూడలేదు. ఇప్పటికైనా సదరు అధికారిపై చర్యలు చేపట్టకపోతే పోలీసు శాఖ ప్రతిష్ట మసకబారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు ఐడిఎల్ స్కూల్లో ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పాలకొల్లు జోన్ క్రీడా పోటీలను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ గుడాల శ్రీ హరి గోపాలరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి దూరం అవుతుందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీల్లో 30 పాఠశాలల నుంచి 1500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, సెక్రటరీ గొర్ల శ్రీనివాస్, ఎఎంసి వైస్ ఛైర్మన్ డిటిడిసి బాబు, పితాని సత్యనారాయణ, సర్పరాజు, భూపతిరాజు, ఆర్‌వి.ఆప్పారావు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో
రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు తిరుపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం గునుపూడిలో ఉన్న పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇఒ. రామకృష్ణంరాజు, అర్చకులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్దిరాజు మృతి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్మలూరు గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా సమితి సభ్యులు, మండల మాజీ కార్యదర్శి గుబ్బల పెద్దిరాజు (60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు పిసి జోషి శనివారం ఉదయం గుమ్మలూరులోని పెద్దిరాజు నివాసానికి వెళ్లి మృతదేహంపై పార్టీ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధత కలిగిన పెద్దిరాజు అంకితభావంతో పార్టీలో పని చేసేవారన్నారు. పెద్దిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామ సర్పంచి గొట్టుముక్కల సానియా రమేష్, పంచాయతీ నాయకులు కుక్కల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు కడలి చంద్రరావు, కుడిపూడి నాగరాజు, కుడుపూడి రత్నరాజు, కడలి సత్యనారాయణ, వి.పుల్లయ్య, కడలి జయరాజు పెద్దిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఉలంపచిలి, మేడపాడు, పెద్దపల్లి, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఎఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు హిమోగ్లోబిన్ పరీక్షలపై ట్రైనర్ రేలంగి వెంకట్ శిక్షణ ఇచ్చారు. శరీరంలో ఉండాల్సిన రక్త శాతాన్ని కనుగొనడానికి ఈ పరీక్షలు ఉపకరిస్తున్నాయన్నారు. 11.0 ఉంటే రక్తహీనత లేదని, 10.0–10.9 ఉంటే తేలికపాటి రక్తహీనత, 7.0 –9.9 ఉంటే మితమైన రక్తహీనత, 7.0 ఉంటే తీవ్రమైన రక్తహీనతగా పరిగణిస్తారన్నారు. ఈ టెస్టుల ద్వారా మానవుని రక్త శాతం కనుగొని వారికి ఉండాల్సిన శాతం కన్నా తక్కువ ఉంటే వారిని రక్తహీనత గల వారీగా గుర్తించి వారికి ఐరన్ మాత్రలతో విశిష్ట అందించి పోషకాహారంతో రక్తశాతం పెంచేలా చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ డి.పవన్‌కుమార్, రేలంగి సుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ వి.ఎలిజబెత్, సూపర్‌వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

'లోకేష్ శంఖారావంతో నూతనోత్తేజం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన శంఖారావం యాత్రతో టిడిపి శ్రేణుల్లోను, ప్రజలలోను నూతన ఉత్తేజం వస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 రోజుల పాటు 120 నియోజకవర్గాల్లో శంఖారావం ప్రచార యాత్రలు నిర్వహించనున్నారని తెలిపారు. ప్రతిరోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచార సభలను నిర్వహిస్తూ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలను, స్థానిక సమస్యలను, అధికార పార్టీ అవినీతి అరాచకాలను, అసత్యాలను ప్రజలకు వివరిస్తూ ఇరు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయనున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నడుం కట్టిన నారా లోకేష్ శంఖారావ యాత్రలో టిడిపి, జనసేన నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచి

ప్రజాశక్తి - ఆచంట

మల్లూరు గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు సర్పంచి నేలపూడి బేబీరామ్మోహన్‌రావు అన్నారు. వల్లూరు సర్పంచిగా ఎన్నికై మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుమారు 60 శాతం పనులు పంచాయతీ బోర్డ్, గ్రామ పెద్దలు, నాయకులు, అధికారుల సహకారంతో పూర్తి చేయగలిగామన్నారు. రానున్న రెండేళ్లలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వంద శాతం పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి జివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

భగ్గేశ్వరంలో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని భగ్గేశ్వరంలో దుర్గమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవం ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కల దుర్గారావు, కవురు వెంకట సత్యనారాయణ, దొంగ బాబాయ్, నిల్లా భద్రం, అంది కోటేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయ 19 వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ ఐస్ పార్లర్ అధినేత తాళ్లూరి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులతో స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డోలు సన్నాయి వాయిద్యాలతో ఒంట్లు వాహనంపై స్వామి వారిని పురవీధుల గుండా ఊరేగించారు. కేరళ నెమలి డ్యాన్స్, ఫైరింగ్ అఘోర డ్యాన్సర్లు, జై భజరంగ తొమ్మిది అడుగుల హనుమాన్ వేషధారణ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు బండి సూర్యనారాయణ, తాళ్లూరి రామ్మోహన్‌రావు, బుద్ధిరాజు విద్యాసాగర్, నెక్కంటి బాపన్న, నంబూరి ఆంజనేయులు, నెక్కంటి శివన్నారాయణ, రామకృష్ణశర్మ పర్యవేక్షణలో ఊరేగింపు నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు గ్రామంలో కోడిపందేల స్థావరంపై రూరల్ సిఐ సతీష్, ఎస్ఐ హరికృష్ణ వారి సిబ్బందితో శనివారం దాడి చే శారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,200 నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, మూడు కోళ్లు, 15 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి : భవానిపేటలోని పేకాట స్థావరంపై ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9,330 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువు పూడికపై ఫిర్యాదు

పాలకొల్లు : పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలో అక్రమంగా చెరువును పూడుస్తున్న యాజమాని సత్యనారాయణరాజుపై చర్యలు తీసుకోవాలని పాలకొల్లు పట్టణ సిఐ మంగాదేవికి ప్రెస్‌క్లబ్ సభ్యులు ఫిర్యాదు చేశారు. చెరువు పూడికపై వార్తలు రాశారని పాలకొల్లు విలేకరి తోట రాంబాబును ఫోన్‌లో బెదిరించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని రాంబాబుతో పాటు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకట రమణ, కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, పిటి.వెంకటేశ్వరరావు, పులపర్తి నాని, మండెల అప్పలరాజు, చిన్ని, లాజరస్, రాపాక రవి, పడార గోపీ ఫిర్యాదు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కలెక్టర్‌ను కలిసిన గుడాల గోపీ, డిటిడిసి బాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఇటీవల భాధ్యతలు చేపట్టిన పివిఎస్ఎన్.రాజు (డిటిడిసి బాబు) జిల్లా కలెక్టర్ ప్రశాంతిని శనివారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఉన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి, పెండింగ్‌లో ఉన్న పథకాల గురించి వారు చర్చించారు.

పేరుపాలెం సౌత్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు ఆధునిక వైద్యం అందించేందుకు రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచి మేళం బంద్ అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన గన్నాబత్తుల వెంకటప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక గన్నాబత్తుల కళ్యాణ మండపంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, ఎముకలు, స్త్రీల వ్యాధి నిపుణులు సుమారు 300 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. రెండో రోజు ఆదివారం కూడా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాదుకు చెందిన వైద్యులు పునీత్, అర్చన, ఎం.అభినవ్‌కృష్ణ, అక్షిత, ఎం.ఆదిత్య, బి.అభిషేక్ సేవలందించారు. ఈ కార్యక్రమంలో గన్నాబత్తుల నందిని, గ్రామస్తులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి
పట్టణ పౌర సమాఖ్య నాయకులు వైకుంఠరావు

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఎం.వైకుంఠరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజులుగా తాగునీరు సక్రమంగా రావడంలేదని, వచ్చినా మురికి నీరు వస్తుందని తెలిపారు. మే నెల రాకుండానే కాలువలో నీరు ఉంటుండగానే తాగునీటి కొరత రావడం దారుణమన్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నీటి పన్ను సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తున్న అధికారులు తాగునీరు ఇవ్వటంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైఎస్ఆర్ కాలనీలో శివారు ప్రాంతాలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - ఉండి

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొడవర్తి రమేష్‌కు పోలీసులు నోటీసు జారీ చేసి ఉండి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు చలో విజయవాడ, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లనీయకుండా అరెస్టు చేసి నిర్బంధించారు. ఈ సందర్భంగా రమేష్ మీడియాతో ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగులను నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగ యువతను మోసం చేశారని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరుద్యోగ యువత ప్రభుత్వాన్ని నిలదీయడానికి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడించడానికి వెళ్తుండగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను నియంత్రించలేరన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు టిడిపి జనసేన ప్రభుత్వాన్ని గద్దెనెక్కించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలంలోని కొయ్యేటిపాడు, సత్యవరం గ్రామాల్లో శనివారం ప్రజల వద్దకు పితాని పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అరాచక పాలనకు అంతమొందించాలని నారా లోకేష్ శంఖారావాన్ని పూరించారన్నారు. సిఎం జగన్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నియోజవర్గంలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, పార్టీ మండలాధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరి మురళి, జనసేన మండలాధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, మండల మహిళా అధ్యక్షురాలు కర్రి పద్మావతి, జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ ముంతాజ్ బేగం ఆలీ, ఆచంట జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

మహా గజమాల యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మహా గజమల యాత్రను విజయవంతం చేయాలని అగ్నికుల క్షేత్ర నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ముత్యాలపల్లిలో శనివారం కరపత్రాలు ప్రదర్శించారు. అంతర్వేది ఆలయం నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పల్లవసేన అధ్యక్షులు కొల్లాటి బాబూరావు మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన సోమవారం కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామం నుంచి గజమాల బైక్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. బంటుమిల్లి, లక్ష్మీపురం మీదుగా భీమవరం మండలం లోసరి, నాగిడిపాలెం, మొగల్తూరు మండలం కాళీపట్నం ముత్యాలపల్లి, మొగల్తూరు, నరసాపురం, చించినాడ, మీదుగా అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు.

శ్వాసపై ధ్యాసతోనే మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్వాసపై ధ్యాసతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సాయివంశీ అన్నారు. ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సాయివంశీ మాట్లాడుతూ మనసులోకి ఎటువంటి చెడు ఆలోచనలు రానీయకుండా కొంత సమయాన్ని నచ్చిన పుస్తకాలు చదవటం, బొమ్మలు గీయటం, పాటలు, మ్యూజిక్ వినటానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీరేష్‌కుమార్, వైద్యాధికారి ధర్మతేజ, ఆచార్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత కోసమే జాబ్‌మేళా
కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ రామ్మోహన్‌నాయుడు

నియామక పత్రాలు అందిస్తున్న కొవ్వలి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించానని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు అన్నారు. నరసాపురం తెలగా కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, శ్రీరామ్ చిట్స్ తదితర 50 ప్రముఖ బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు సుమారు పది వేల మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. పెద్దఎత్తున నిరుద్యోగ యువత వచ్చారు. అందులో అధిక సంఖ్యలో యువతిలు ఉన్నారు. ఈ మెగా జాబ్ మేళాను కొవ్వలి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో వైఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, నాయకులు పొత్తూరి రామరాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొప్పాడ రవీంద్రనాథ్‌ఠాగూర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాబ్ మేళా కన్వీనర్‌గా సిహెచ్.కాశీ విశాలాక్షి వ్యవహరించారు.

అంగన్వాడీల పోరాటం స్ఫూర్తిదాయకం
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

ప్రజాశక్తి - పెనుగొండ

మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

ఉద్యోగులు, కార్మికుల ఐక్య పోరాటాలకు అంగన్వాడీల పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. 10, 11 తేదీల్లో సిద్ధాంతం గ్రామంలో నిర్వహించే అంగన్వాడీల జిల్లా శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకు ఎం.విజయలక్ష్మి, దివ్య స్వరూప అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42 రోజులు అంగన్‌వాడీలు నిరవధిక పోరాటం చేయడం కార్మిక రంగం చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రానున్న కాలంలో ఉద్యోగులు, కార్మికుల ఐక్యతకు అంగన్వాడీల పోరాటం దిక్సూచిగా ఉంటుందన్నారు. వారి పోరాట పటిమ అసంఘటిత రంగంలో పెద్ద మార్పు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఇతర రంగాల కార్మికులు కూడా ఐక్యమవుతున్నారన్నారు. కార్మిక లోకానికి సిఐటియు అండదండలు ఎప్పుడు ఉంటాయన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో అంగన్వాడీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఝాన్సీ లక్ష్మి, డి.కళ్యాణి, పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ కె.తులసి, పెనుగొండ మండల లీడర్ పీడీ పరమేశ్వరి, సిఐటియు నాయకులు కప్పల రత్నరాజు, కడలి త్రినాథ్ పాల్గొన్నారు.

మద్దాల బ్రదర్స్‌కు ఘన సత్కారం



మద్దాల బ్రదర్స్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ అధినేతలు మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసులను శనివారం ఘనంగా సన్మానించారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూలులో భారతదేశంలోనే అతిపెద్ద సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించి అతి ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, లాంగెస్ట్ సైన్స్ ఫెయిర్ ఇన్ ఇండియా, ఎక్కువమంది సందర్శించిన సైన్స్ ఫెయిర్ వంటి నాలుగు రికార్డులను స్కూల్ సొంతం చేసుకుంది. ఈ సైన్స్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసిన మద్దాల బ్రదర్స్‌ను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ఫెయిర్లు నిర్వహించడం అరుదన్నారు. పాలకొల్లు పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసుకునేలాగా ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌కు 623 ప్రాజెక్టులు, ఒక కిలోమీటర్ పొడవు, 12 వేల మంది పైగా సందర్శించిన రికార్డులను సొంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రావాడ సతీష్, అసిస్టెంట్ గవర్నర్ ఇమిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాసరావు, షేక్ పీర్ సాహెబ్, మైగాపుల రాంబాబు, కటారి నాగేంద్రకుమార్, కావలి నగేష్, రోటరీ సభ్యులు జక్కంపూడి కుమార్, జక్కంపూడి రాంప్రసాద్, గన్నాబత్తుల శ్రీనివాస్, కానూరు ప్రభాకరరావు, సిరిగినిడి శ్రీరామ నాగార్జునరావు, సలాది రామచంద్రరావు, జవాది కళ్యాణ్, పాతబత్తుల సత్యనారాయణ, చిలుకురి భీమన్న పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశంతో కేడర్‌లో జోష్
ఎంఎల్‌ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల



ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రామరాజు

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంతో పార్టీ కేడర్‌లో కొత్త జోష్ వచ్చిందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని సూర్యారావుపేట, కాళ్ల, దొడ్డనపూడి గ్రామాల్లో ఇంటింటికి టిడిపి, బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామకరాజు ఇంటింటికీ వెళ్లి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి గెలిస్తేనే ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగిందని విమర్శించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాల్జేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచి యలమంచిలి రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు, ఎంపిటిసి మాజీ సభ్యులు వేగశ్న రమేష్‌రాజు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ గులిపల్లి జోగయ్య, గ్రామాధ్యక్షుడు కొప్పినీడి గణపతి, ఉప సర్పంచి పన్నాసి అబ్బులు, టిడిపి నాయకులు కడలి దుర్గాప్రదీప్, పుప్పాల బుజ్జి, మొగళ్ల షావుకారు, బండారు నాని, వీరమల్లు సురేష్, కోలా చంద్రశేఖర్, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్, ఎంపిటిసి మాజీ సభ్యులు కందులపాటి వీరరాఘవులు, కొల్లి శ్రీనివాసు, ఆరేటి కృష్ణ, ఆరేటి పద్మారావు పాల్గొన్నారు.

పితాని వాస్తవాలు గ్రహించి మాట్లాడాలి
ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సీతారామ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో ఏం జరుగుతుందో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కళ్లతో చూసి, వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. ఆచంటలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పితాని సత్యనారాయణ పాదయాత్ర పేరుతో ఊరురా తిరుగుతూ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగ నాథరాజుపై ఆరోపణలు చేయడం పితాని సత్యనారాయణ అవివేకానికి నిదర్శనమన్నారు. కొడమంచిలి శివారులో ఆటో ప్రమాదానికి గురై ఇద్దరు విద్యార్థులు మృతి చెందితే తక్షణమే శ్రీరంగనాథరాజు స్పందించి పాలకొల్లు ఆసుపత్రికి వెళ్లి క్షత గాత్రులను పరామర్శించి, విద్యార్థుల మృతదేహాలను చూసి చలించిపోయారన్నారు. ఈ తరహాలో విద్యార్థుల మృతదేహాలను భద్రపరిచేందుకు రెండు ఫ్రిజర్ బాక్సులు ఏర్పాటు చేశారన్నారు. ఎంఎల్‌ఎపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ఇఎస్ఐ స్కామ్‌లో ఎంత అవినీతికి పాల్పడ్డారో రాష్ట్ర ప్రజలందరికి తెలుసన్నారు. అవినీతికి, అక్రమాలకు, నిరంకుశ పాలనకు, కులాల మధ్య చిచ్చుపెట్టి, కులం పేరుతో పబ్బం గడిపే ఏకైక నాయకుడు పితాని అని విమర్శించారు. ఆచంట సర్పంచి కోట సరోజినీ మాట్లాడుతూ ఆచంటలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మాజీ మంత్రి పితాని సత్యనారాయణ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. అర్హత ఉంటే నేరుగా అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. ఈ సమావేశంలో వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి, ఉప సర్పంచి కొండేటి సురేష్, కొడమంచిలి రైతు సంఘ అధ్య క్షులు మన్నె సుబ్బారావు, వైసిపి గ్రామ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానల ఛైర్మన్లు కుక్కల కిరణ్, వేమన అప్పారావు, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎల్‌ఎ నిమ్మల పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు

యలమంచిలి మండలం కంచుస్తంభంపాలెం గ్రామం నుంచి ప్రారంభమయ్యే మన పాలకొల్లు - మన రామానాయుడు పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కోరారు. ఆయన తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నాయకుల విస్తృత సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో చాలామంది సీజనల్ నాయకులు వస్తుంటారు, వెళ్తుంటారని అటువంటి వారిని నమ్మొద్దని కోరారు. ఎంఎల్‌ఎగా తాను ఏనాడు భావించలేదని, ప్రజాసేవకుడిగా, ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమవుతూ పని చేశానని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే తనకు అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులు కోసమే పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చేట్టి బాబు, జివి, మం డలాధ్యక్షులు కోడి విజయభాస్కర్, కార్యదర్శి పాముల రజిని, పోడూరు మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్య నారా యణరాజు, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, జనసేన నాయకులు బోణం నరసయ్య, యలమంచిలి మండలాధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు
కౌలు రైతుల శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 11, 12 తేదీల్లో ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు భీమవరం క్లాత్ మర్చంట్ భవనంలో నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తరగతులను ప్రొఫెసర్స్, సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బోధిస్తారని తెలిపారు. శిక్షణా తరగతులకు అంతా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు ఎస్‌టి కాలనీలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపీ) శనివారం పర్యటించారు. ముందుగా ఏకలవ్యుని విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విపర్తి ప్రభాకర్, గౌరవ మండలాధ్యక్షులు మైలబత్తుల మైఖేల్‌రాజు, ఛాంబర్ అధ్యక్షులు గుమ్మప్ప పెద్దిరాజు, సర్పంచి కనకభద్రం విశ్వనాథం, గ్రామ అధ్యక్షులు రాగి సర్వేశ్వరరావు, ఇస్సాకు రాజు, సర్వర ప్రసాద్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గూడూరి శ్రీనివాసు, తండ్రి: వెంకట సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. తాళ్ళపాలెం, దేవ నుండి పెనుగొండ వస్తుండగా పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **V7833241** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
గూడూరి శ్రీనివాసు
తండ్రి: రమ వెంకట సత్యనారాయణ
డోర్ నంబర్: 4-7, తాళ్ళపాలెం
దేవ, పెనుగొండ మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 8463981819

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 314/21

Between:
Vijaya Bank, Tanuku, Now Bank of Baroda, Tanuku, Rep. by its Manager —వాది
మరియు
1. వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డో.నెం. 5–114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సత్యవతి, W/o. ప్రసాద్, డో.నెం. 5–114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
—ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీ ఇద్దరికి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము **ది. 14-02-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున సదరు తేదీన మీరిరువురు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క అక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానింపబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
తణుకు — **ఓ.ఎన్.కృష్ణ,** అడ్వకేట్
10-2-24 — తణుకు, సెల్:9848199440

In the Court of the 1st Additional Junior Civil Judge Cum - 1st Additional Judicial Magistrate of 1st Class, Tadepalligudem
I.A. No. 190/2021 in **O.S. No. 491/2021**

In Between:
Yempalla Suhasini ***...Plaintiff/ Petitioner***
AND
Marapatla Jyothi and another ***...Defendants/ Respondents***
Respondent No-1: Smt. Marapatla Jyothi, W/o. (late) Suneel Kanth, Female, age 40 yrs, R/o. Opp. R.C.M. Church, Chinanindrakolanu Village, Nidamarru Mandal.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు, మీపై దావా దాఖలు చేసినప్పటి నుండి 1వ ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు నోటీసు పంపినప్పటికి మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు నోటీసులు అమలు నిమిత్తం **ది. 28-02-2024వ తేదీ వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం 10.30 ని॥ల** లగాయితు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి అక్షేపణలు ఉన్న యెడల తెలుపగలరు. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

INJETI RAJESH, Advocate
Tadepalligudem, Cell: 9912017174

IN THE COURT OF THE HON'BLE VII ADDL. DISTRICT JUDGE, ELURU
O.S.No.10/2021

Between:
Sri Kommana Lakshmi Narsu ...Plaintiff
And
Smt.Gedela Padmavathi and 3 Others ...Defendants

పై నంబరు దావాలో D1.అయిన Smt. Gedela Padmavathi, W/o.Venkata Koteswara Rao, R/o.D.No.20E-13-2, 42nd Division, Bommivari Street, Eluru, W.G. Dist., D2 అయిన Sri. Voruganti Venkata Siva Rama Krishna, S/o.Venkataramaiah, R/o.D.No.3D-9-3, Western Street, Eluru, W.G.Dist. అను వారికి నోటీసుల అమలు కొరకు ది.13.02.24 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు శ్రీకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

E.SRINIVAS BABU
Advocate, Road No.2, NGO Colony,
ఏలూరు, Ameenapet, Eluru, W.G.Dist.
తేది.07-01-2024 Ph: 08812-239498